
విద్యార్థులకు క్విజ్ పోటీలు

నవాబుపేట, మార్చి 5: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధారూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గంగ్యాడ కాంప్లెక్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం మల్లేశం, నోడల్‌అధికారి అబ్దుల్‌రహెమాన్, ప్రాథమిక పాఠశాల హెచ్‌శ్రీఎం రాములు, ఫౌండేషన్ జిల్లా సీనియర్‌మెంటర్ రాములు, యాదయ్య, సత్యానంద్, లక్ష్మీనారాయణ తదిరులు పాల్గొన్నారు.



రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్నాయి. భానుడి భగభగలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మండే ఎండల్లో పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే.. ఏప్రిల్, మేలో పరిస్థితి ఏంటని జనం భయపడుతున్నారు. ఉదయం 8 గంటలకే ఉక్కపోత మొదలవుతుంది. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలూ పెరగడంతో ప్రజలు తట్టుకోలేక పోతున్నారు.

- మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- ఇబ్బంది పడుతున్న కూలీలు, రైతులు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దంటున్న నిపుణులు
- రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న వైద్యులు
- వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని సూచన
- ఏప్రిల్, మే నెలలో ఎండలు మరింతగా ఉండొచ్చంటున్న వాతావరణ శాఖ
- కూలర్లు, శీతల పానీయాలకు పెరుగుతున్న డిమాండ్

మార్చిలోనే మంటలు!

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఉమ్మడి జిల్లాలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

తేది	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
మార్చి 05	39.2	39.0	38.7
మార్చి 04	38.7	37.9	38.8
మార్చి 03	38.8	38.2	38.2
మార్చి 02	37.1	38.2	37.5
మార్చి 01	36.8	37.6	37.8
ఫిబ్రవరి29	37.3	37.8	37.9
ఫిబ్రవరి28	38.0	37.9	38.0



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 5: ఉమ్మడి జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. మునుపెన్నడూ లేనంతగా మార్చి మొదటి వారంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు జనం బెంబేలెత్తితున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం వేళలో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉపాధి కూలీలు, కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులకు వడదెబ్బకు గురవకుండా ఎక్కువనీటిని తాగుతూ మజ్జిగ, పండ్ల రసాలు వంటివి తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. గతేడాది కంటే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇళ్లలో ఉండేవారు ఏసీలు, కూలర్లు పెట్టుకుని ఉపశమనం పొందుతున్నారు. మరి కొంతమంది చెట్ల కింద సేద తీరుతున్నారు. మూగజీవాల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. ఎండలో మేతకు తీసుకుపోకుండా చూడాలని, పశువుల పాక, కొట్టాల్లోనే నీటిని చల్లాలని, నీటితో తడిపిన తట్టు సంచులు వేయాలని జాగ్రత్తలు చెబుతున్నారు. మరోవైపు మండుతున్న ఎండలకు పొలాలు తడారిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



39.2. డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

వాస్తవానికి ఏప్రిల్, మేలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈసారి ఫిబ్రవరి ఎండింగ్, మార్చి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు దాటి పోయింది. మార్చి మొదటి వారంలోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే.. ఇక ఏప్రిల్, మేనే నెలలో భానుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో అత్యధికంగా 39.2డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తర్వాత వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో 39.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో 38.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కూలర్లు, ఏసీలు, శీతల పానియాలకు పెరిగిన డిమాండ్

ఎండలు ముదరడంతో కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. తక్కువ విద్యుత్ వినియోగించే ఏసీలు, కూలర్లపై వినియోగదారులు మక్కువ చూపుతున్నారు. కరెంటు లేకున్నా ఇన్వర్టర్, బ్యాటరీలతో పనిచేసే వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఎండ వేడిమికి ఉపశమనం కోసం శీతల పానీయాలపై జనాలు ఆసక్తి చూపడంతో జ్యూస్, ఐస్‌క్రీమ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటికి డిమాండ్ పెరిగింది.

తీవ్రంకానున్న వడగాలులు

రాబోయే రోజుల్లో వడగాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశాలున్నాయంటున్నారు వాతావరణ నిపుణులు. ఈసారి ఎండల తీవ్రత పంటలపై కూడా ప్రభావం చూపనుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు వేసవి కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు.



నిర్లక్ష్యం చేయొద్దు

ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయటకు వెళ్లకపోవడమే మంచింది. ఏ మాత్రం అసౌకర్యంగా ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, కార్మికులు, క్రీడాకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతీ ఒక్కరు నీటిని ఎక్కువగా తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్‌కు బదులుగా మజ్జిగ, పండ్ల రసాలు తాగడం మంచిది. వేసవిలో ఉపశమనం కోసం కర్బూజ, దోస కాయలు, ఇతర పండ్లు తీసుకోవాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే కూలింగ్ గ్లాసెస్, హెల్మెట్, గ్లౌజ్‌లు, గొడుగు వంటివి వెంట తీసుకెళ్లాలి.

వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి



ఘట్‌కేసర్‌లో జెండా ఊపి ఎంఎంటీఎస్ రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, అధికారులు

ఎంఎంటీఎస్ వచ్చింది!

- ఘట్‌కేసర్ - లింగంపల్లి మధ్యన రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

ఘట్‌కేసర్, మార్చి 5: ఘట్‌కేసర్- లింగంపల్లి మధ్య నడిచే ఎంఎంటీఎస్ రైలును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. సంగారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని ఎంఎంటీఎస్ రైలుతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాగా ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో మేడ్చల్ ఎమ్మెల్యేమాల్లారెడ్డి జెండాఊపి రైల్వే అధికారులతో కలిసి ఎంఎంటీఎస్ రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లింగంపల్లి-ఘట్‌కేసర్‌ల మధ్య నడిచే ఎంఎంటీఎస్ రైలును సికింద్రాబాద్ - ఘట్‌కేసర్ మధ్యన సైతం నడిపించాలని డీఆర్ఎం బర్తేష్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల ప్రజలతో పాటు మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం సికింద్రాబాద్ వెళ్తుంటారని, ఉద్యోగులు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది కనుక ఆ దిశగా రైల్వే శాఖ చర్యలు చేపట్టాలని కోరారు. సికింద్రాబద్- తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఘట్‌కేసర్‌లో నిలిచే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లిపావని జంగయ్య యాదవ్ డీఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లుల మాధవరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె!

- నేటి నుంచి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు
- గణపతి పూజ, యాగశాల ప్రారంభంతో అంకురార్పణ
- ఆరు రోజుల పాటు ఉత్సవాలు, స్వామివారికి విశేష పూజలు
- అట్టహాసంగా నిర్వహించేదుకు చర్యలు

కీసర, మార్చి 5: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేడు నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కీసరగుట్ట వేద పాఠశాల పండితుడు గణపతి శర్మ అధ్వర్యంలో పండితులు గణపతి పూజ, యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఆనంతరం రాత్రి శ్రీ భవాని శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కీసరకు తీసుకురానున్నారు. తిరిగి గురువారం రాత్రి కీసర నుంచి పల్లకీలో స్వామివారు కీసరగుట్టకు ఊరేగింపుగా వెళ్లి కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. కాగా బ్రహ్మోత్సవాల అట్టహాసంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, జిల్లా అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో తమిళులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు.



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆలయ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆనంతరం అర్చకులు రామలింగేశ్వరుడి తీర్థ ప్రసాదములు, ఆశీర్వచనలు అందజేసి శాలువతో సత్కరించారు.

జాతరకు శాఖల పరంగా ఏర్పాట్లు

1800మంది పోలీసులు జాతరలో విధులు నిర్వహించనున్నారు. అదే విధంగా బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పర్యవేక్షించే విధంగా 56 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్ల విషయంలో షీటీమ్, మఫ్టీలో పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించారు. 1700 మంది పారిశుధ్య కార్మికులు బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు వారికి కీసరవాణి వద్ద భోజనం సౌకర్యాలు కల్పించారు.

30 లక్షల లీటర్ల నీటి సరఫరా

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మిషన్ భగీరథ అధికారులు 30 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయనున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేకంగా కార్మికులను ఏర్పాటు చేశారు. 16 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 4 జనరేటర్లతో విద్యుత్ అధికారులు 24గంటల విద్యుత్ సరఫరా చేయనున్నారు. 70 మంది విద్యుత్ అధికారులు జాతరలో విధులు నిర్వహించనున్నారు. 120 మంది వైద్య సిబ్బంది భక్తులకు సేవలందించనున్నారు. కీసరగుట్ట ఆలయం పక్కన, కీసరవాణి కేంద్రం వద్ద రెండు వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ అధికారులు 300 బస్సులను ఏర్పాటు చేశారు. భక్తులకు ఆర్యవైశ్య నిత్యన్నదానం, రెడ్డిసత్రం, వంశరాజ్ అన్నదానసత్రం, మున్నూరుకాపు సంఘం అధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు.



కీసరగుట్ట (ఇన్‌సెట్‌లో రామలింగేశ్వరుడు)



మొదటి రోజు పూజలు

మాఘ బహుళ ఏకాదశి బుధవారం 6వ తేదీ ఉదయం విఘ్నేశ్వరుడి పూజతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పుణ్యాహవచనము, రుత్విక వరణము, యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి ప్రతిష్ఠాపన, అగ్నిప్రతిష్ఠపన, భేరిపూజ, ధ్వజారోహణం, ద్వాత్రింశతి రాగాలాపన, హారతి, మంత్రపుష్పం, పరాకస్తవ నిర్వహిస్తారు. తీర్థప్రసాద వినియోగం ఆనంతరం స్వామివారు ఉత్సవమూర్తులతో కీసర గ్రామానికి విచ్చేసి వంశపారంపర్యస్థుల గృహంలో సేద తీరుతాడు.



బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం

జాతరకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, ధర్మకర్తలు, భక్తుల సహకారంతో ఆరురోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేస్తాం. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. 80వేల లడ్లు, వడ, పులిహోర ప్రసాదం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా వీవీఐపీ. వీఐపీ, ఆన్‌లైన్ ద్వారా, ఇతర సేవల ద్వారా వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశాం.

ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ

- లోక్‌సభ ఎన్నికల ముందు ఏర్పడిన ప్రాధాన్యత
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన అంశం
- త్వరలో గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రచారం?
- ఏసీడీపీ, ప్రత్యేక నిధుల కోసమే సీఎంను కలిశాను
- రాజకీయం కోణం ఏమీలేదు : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



రేవంత్‌రెడ్డికి శాలువ కప్పుతున్న బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

బీఆర్ఎస్‌కు ఝలక్!

సీఎంతో చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే భేటీ, నెలకొన్న ఆసక్తి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 5 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఒక్కొక్కరు జారుకుంటూ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు. రోజు రోజుకి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు సాగుతున్నాయి. ఎన్నికల వేళ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. తాజాగా చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం 2009లో ఎస్సీలకు రిజర్వు అయ్యింది. ఎస్సీ రిజర్వుడ్ తర్వాత కాలె యాదయ్యకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కింది. నాడు కాంగ్రెస్ పార్టీ తరఫున యాదయ్య పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నంపై ఓటమి చెందారు. ఇక తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కాలె యాదయ్య మరోసారి పోటీ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై విజయం సాధించారు. అయితే, కొన్నాళ్లకే ఆయన అభివృద్ధి పేరిట బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో జరిగిన ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ రత్నంపై ఘన విజయం సాధించారు. వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన యాదయ్య మూడోసారి 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీమ్‌భరత్‌పై స్వల్ప(268) మెజారితో విజయం సాధించారు.

వరుసగా సీఎంను కలుస్తున్న నేతలు

వరుసగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తుండటంతో వారంతా పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ నేపథ్యంలోనే చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలవడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల చాలామంది బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడుతున్న క్రమంలో యాదయ్య కూడా గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రచారం ఊపందుకుంది. ఈ విషయంలో యాదయ్య ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తాను సీఎంను కలిసిన విషయం నిజమేనని, ఏసీడీపీ, ప్రత్యేక నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని, ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

మన ఊరు - మనబడి పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, మార్చి 5: జిల్లాలో మన ఊరు - మన బడి కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు- మన బడి కింద చేపట్టిన పెండింగ్ పనులు, సీసీరోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. ఉపాధి హామీ కింద పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పూర్తి నివేదిక పంపాలన్నారు. ఇంజనీర్లు, డీఈలు నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ, డీఈవో, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు డీఈలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్యకర్తల సమావేశం

తాండూరు, మార్చి 5 : తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గురువారం గోదాల ప్రతాప్‌రెడ్డి గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్, మార్చి 5: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పునాదులు పడనున్నాయి. ఇటీవల కొడంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్ల 50లక్షలు నిధులు మంజూరు చేసి నట్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు మల్లికార్జున్‌రెడ్డి, ఓం ప్రకాశ్, తులసిరామ్, గణేశ్, శ్యామ్‌సుందర్ తదితరులు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్‌గుప్త, రత్నం, రాజు తదితరులు ఉన్నారు.

కార్మికులు ఓబీసీడీబ్ల్యూ కార్డు పొందాలి



ఓబీసీడీబ్ల్యూ కార్డులను అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

తాండూరురూరల్, మార్చి 5: భవన నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగా ఓబీసీడబ్ల్యూ కార్డు పొందాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు పటేల్ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) కోరారు. మండలంలోని గౌతాపూర్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులను అందజేశారు. భవన నిర్మాణ కార్మికులు ఓబీసీడబ్ల్యూ కార్డు ద్వారా వివాహానికి రూ.30వేల ఆర్థిక సాయం, ప్రసూతి ప్రయోజనం, ప్రమాదవశాత్తు మరణం, సహజ మరణం, అంత్యక్రియల ఖర్చు వంటివి పొందేందుకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్డు పొందేందుకు 18-55ఏళ్ల వయస్సు గల భవన నిర్మాణ కార్మికులు దరఖాస్తు చేసుకుంటే తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా పొందే అవకాశం ఉందన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చాలి

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ మార్చి 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ఆన్‌లైన్ ప్రక్రియలో ఏవైనా లోపాలుంటే వాటిని సవరించి అర్హులకు లబ్ధి చేకూర్చాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాల సాఫ్ట్‌వేర్‌పై విద్యుత్‌శాఖ కార్యదర్శి రిజ్వి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేసి అర్హులకు లబ్ధి చేకూర్చాలని మున్సిపల్ కమిషనర్లు, ఎండీవోలను ఆదేశించారు. ఇది వరకే ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల వద్దనే ఈ ప్రక్రియను కొనసాగించాలన్నారు. ఆన్‌లైన్‌లో అభ్యర్థి ఆధార్ నంబర్, కరెంటు బిల్లు, యుఎస్‌సీ నంబర్, గ్యాస్ కనెక్షన్, కస్టర్ ఐడీ, కన్స్యూమర్ ఐడీలను క్రాస్ చెక్ చేసి రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో ఉన్న చోట తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్‌లలో అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఉంటారని అవసరమైతే 2 లేదా 3 కంప్యూటర్లను, ఆపరేటర్లను అందుబాటులో ఉంచాలన్నారు. రద్దీగా ఉన్న చోట ఎండీవోలు, మున్సిపల్ కమిషనర్లు దగ్గరుండి పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్‌అగస్త్యా పాల్గొన్నారు.







మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్‌లో

పురుగుల అన్నం లొల్లి


నిరసన చేపడుతున్న మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

- మరోసారి అన్నం, స్వీట్, టిఫిన్‌లో పురుగులు రావడంతో విద్యార్థుల నిరసన
- విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం : విద్యార్థి సంఘాలు

మేడ్చల్‌టౌన్, మార్చి 5 : అన్నంలో పురుగు వస్తున్నాయంటూ మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు మంగళవారం మరోసారి నిరసనకు దిగారు. విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు దండు కోవటమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కొద్ది రోజుల క్రితం మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్ అన్నంలో పురుగులు వస్తున్నాయంటూ విద్యార్థులు ఆందోళ చేసిన విషయం విదితమే. కాగా యూనివర్సిటీ హాస్టల్ నిర్వాహకులు నాణ్యమైన భోజన వసతులు కల్పిస్తామని విద్యార్థులకు కచ్చితమైన హామీ ఇవ్వటంతో అప్పట్లో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా సోమవారం రాత్రి అన్నంతో పాటు పెట్టిన స్వీటులో పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో బాలికల హాస్టల్ విద్యార్థినులు హాస్టల్ నిర్వాహకులను నిలదీశారు. అన్నం తినకుండా భీష్మించడంతో నిర్వాహకులు విద్యార్థినులను సముదాయించటంతో నిరసన వీడారు. తిరిగి మంగళవారం ఉదయం టిఫిన్ చేసేటప్పుడు మళ్లీ తిరిగి పురుగులు కనబడటంతో అన్న బహిష్కరణ చేసి నిరసన చేపట్టారు. విద్యార్థుల నుంచి డబ్బులు దండుకుంటూ అన్నం సరిగా పెట్టటం లేదని క్యాంటీన్ నిర్వాహకులను నిలదీశారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు మల్లారెడ్డి యూనివర్సిటీ గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న యూనివర్సిటీ ప్రముఖులు విద్యార్థి సంఘాలు, హాస్టల్ విద్యార్థినులతో చర్చలు జరిపారు. పొరపాట్లను సరిదిద్దుతామని, హాస్టల్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హాస్టల్‌లో వండే అన్నం విషయంలో నాణ్యతతో పాటు శుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో విద్యార్థులు శాంతించారు.

విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం

మల్లారెడ్డి యూనివర్సిటీ హాస్టల్‌లో విద్యార్థులకు పెడుతున్న భోజనంలో పురుగులు రావటం శరమామూలుగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కార్తీక్, సంతోష్ రాథోడ్ ఆరోపించారు. అన్నంలో పురుగులు వస్తే వార్డెన్‌ను చూపెడితే పురుగులు పక్కన పెట్టి అన్నం తినమని ఉల్టా దబాయిస్తున్నారని ఆరోపించారు. అన్నంలో పురుగులు వస్తున్న వ్యవహారంలో విద్యార్థులు నోరు విప్పకుండా క్యాంటిన్ నిర్వాహకులు విద్యార్థులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీలో చదివే విద్యార్థుల భవిష్యత్ యూనివర్సిటీ నిర్వాహకులపై ఆధారపడి ఉండటంతో చాలా మంది విద్యార్థులు పురుగుల అన్నం విషయాన్ని బయటకు చెప్పడానికి భయపడుతున్నారని తెలిపారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో హాస్టల్‌ను ప్రభుత్వ అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ధనార్జనయమే ధ్యేయంగా విద్యాసంస్థలు నడుపుతున్న యూనివర్సిటీపై ఎస్ఎఫ్ఐ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

డీఎల్‌పీవో శంకర్‌నాయక్


బషీరాబాద్ పంచాయతీలో ఇంటి టాక్స్‌ల వసూళ్లపై సమీక్షిస్తున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్

బషీరాబాద్, మార్చి 5: ఇంటి పన్ను వసూళ్లపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని తాండూరు డివిజన్ డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఇళ్ల టాక్స్‌ల వసూళ్లకు సంబంధించి సమీక్షిస్తూ అక్కడున్న ఎంపీవో రమేష్‌తో ఆరాతీశారు. అనంతరం ఆయన విలేకర్లతో మట్లాడుతూ బషీరాబాద్ మండల వ్యాప్తంగా 36 పంచాయతీలకు గానూ రూ.30లక్షల 42వేల 894 ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా నేటి వరకు రూ18లక్షల 82వేల 382 వసూళ్లు చేసినట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని తాండూరులో 33 పంచాయతీల్లో రూ.99లక్షల 91వేల 766 వసూళ్ల లక్ష్యం కాగా రూ.59లక్షల 58వేల 038, యాలాల మండలంలో 37 పంచాయతీల్లో రూ.57లక్షల 6వేల 41 వసూళ్ల లక్ష్యం కాగా రూ.29లక్షల 8వేల 95, పెద్దేముల్‌లో 37 పంచాయతీల్లో రూ.43లక్షల 29వేల 492 టాక్స్ వసూళ్లకు గాను రూ.26క్షల 36వేల 419, కొడంగల్ మండలంలో 26 పంచాయతీల్లో రూ.32లక్షల 52వేల 538 టాక్స్ వసూళ్లకు గాను రూ.23లక్షల 55వేల 176, బొంరాస్‌పెట్ మండలంలో 47 పంచాయతీల్లో రూ.30లక్షల 87వేల 147 పన్ను వసూళ్లకు గాను రూ.17లక్షల 22వేల 936, దౌల్తాబాద్‌లో 33 పంచాయతీల్లో రూ.33లక్షల 12వేల 116 టాక్స్ వసూళ్లకు రూ.19లక్షల 22వేల 996 వసూళ్లు జరిగినట్లు ఆయన వివరించారు. మార్చి 31లోపు టాక్స్ వసూళ్ల లక్ష్యం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి

చర్యలు తీసుకోవాలి


రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట్, మార్చి 5: ధరణిలో రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ రికార్డులను, కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

కొడంగల్, మార్చి 5: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు కాగానే అన్నివర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం ధరణిలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు లిస్టు నమోదు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


డీఎల్‌పీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల

వేతనాలు వెంటనే చెల్లించాలి

బషీరాబాద్, మార్చి 5: పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, బుగ్గప్ప డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వేతనాలతో పాటు దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. పంచాయతీల్లో వివిధ కేటాగిరిల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రతీనెల చెల్లించాల్సిన వేతనం 5 నెలల నుంచి 8 నెలలుగా పెండింగ్ ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26వేలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకులు శ్యామప్ప, అనంతయ్య, చందు, లక్ష్మీ, యాదమ్మ, బుజ్జి, జగ్గమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులను చేయడమే ధ్యేయం


శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న పురుషోత్తంరెడ్డి, సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 5: విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చాలన్నదే తమ యూనివర్సిటీ లక్ష్యం అని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ పురుషోత్తంరెడ్డి అన్నారు. కళాశాల విద్యార్థి శ్రీనివాస్‌రెడ్డి రసాయన శాస్త్రంలో 'ట్రయజోల్ ఫార్మకోఫోర్ అండ్ డైయ్యర్ యాంటీ కేన్సర్ ఎవాల్యుయేషన్' అంశంపై ప్రొఫెసర్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించాడు. అతడిని వీసీ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి మంగళవారం అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడాలనేదే తమ యూనివర్సిటీ లక్ష్యం అన్నారు. తమ వర్సిటీ పరిశోధకులకు చక్కటి వేదికన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దామోదర్, రిజిస్ట్రార్ రవీందర్, డీన్ రాజు, సుందర్, కవిత, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


దస్త్రాలను పరిశీలిస్తున్న డీపీవో మోహన్ సురేష్

పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన డీపీవో

మొయినాబాద్ రూరల్, మార్చి 5 : హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి మోహన్‌సురేష్ తనిఖీ చేశారు. గ్రామంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి యార్డుల్లోకి తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని గుర్తించి కార్యదర్శిపై మండిపడ్డారు. డీపీవో పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూళ్లు, పారిశుధ్య పనులపై పీఎస్ సంధ్యను వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



రాములు, భరత్‌ప్రసాద్‌లకు ఘన స్వాగతం

ఆమనగల్లు, మార్చి 5: నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు, నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌లకు మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. బీజేపీలో చేరి హైదరాబాద్ వచ్చిన రాములు, అభ్యర్థిత్వం ఖరారైన భరత్‌ప్రసాద్‌లకు నాయకులు పూలమాలలు వేసి సత్కరించారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని రాములు, భరత్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కాగా రాములు, భరత్‌ప్రసాద్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీని నగరంలోని బేగంపేట ఎయిర్‌పోర్టులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పర్యటకు వచ్చిన సందర్భంగా మోదీని కలిసినట్టు వారు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ


మంత్రిని కలిసిన శంకర్‌పల్లి నాయకులు

శంకర్‌పల్లి, మార్చి 5: పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కె.శ్రీకాంత్ సచివాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో ఆమె మాట్లడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యువత క్రియాశీలకంగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో మల్లేష్, బాబ ఉన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు

లక్ష్మీవేంకటేశ్వరాలయం ముస్తాబు


చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం

చేవెళ్ల, మార్చి 5: ఈ నెల 8న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఉత్సవాలకు చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరాలయం ముస్తాబైంది. 8 నుంచి 14వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ మేనేజర్(ఈవో) నరేందర్, ధర్మకర్తలు శ్రీకాంత్‌చారి, శ్రీపాద్ తెలిపారు. 14వ తేదీన రథోత్సవంతో కార్యక్రమాలు పూర్తవుతాయని, భక్తులు తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. 600సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ ఆలయంలో ఉత్సవాలకు ఎంతో ప్రాశస్త్యం ఉందని అర్చకులు పేర్కొన్నారు.


అయినాపూర్‌లో బురుజు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

గ్రామకంఠం భూమి పరిశీలన

దోమ, మార్చి 5: గ్రామ కంఠం భూమిలో ఇంటి నిర్మాణంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించనున్నట్లు డీఎల్‌పీవో సంధ్యారాణి అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామంలో బురుజు నేలమట్టం, గ్రామ కంఠం భూమిలో ఇంటి నిర్మాణంపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బురుజు నేల మట్టం, ఇంటి నిర్మాణంపై భూమికి, ఇంటికి సంబంధించిన ఎలాంటి పత్రాలు ఉన్నా ఇరువర్గాల వారు పంచాయతీ కార్యదర్శికి అందించాలన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు, మాజీ సర్పంచ్ మున్నయ్య, గోవర్ధన్, బాబయ్య, రాములు, జనార్ధన్‌గౌడ్, రవిగౌడ్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న డీఆర్డీవో పీడీ శ్రీనివాస్

దివ్యాంగులు స్వయం ఉపాధితో ఎదగాలి

డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్

తాండూరురూరల్, మార్చి 5: దివ్యాంగులంతా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. తాండూరులోని ఐకేపీ స్త్రీ శక్తి భవన్‌లో మంగళవారం డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్, సిబ్ని ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండురోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా డీఆర్‌డీవో పీడీ ఏ.శ్రీనివాస్ మాట్లాడుతూ చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దివ్యాంగులను గుర్తించి అర్హులైన 37మందికి రూ.25వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడ్బి ప్రతినిధి రామకృష్ణ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, పీఎస్ శ్రీనివాస్, ఉదయ్, కో-ఆర్డినేటర్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


వెంకయ్యనాయుడుకు అభినందనలు తెలుపుతున్న టి.దేవేందర్‌గౌడ్, టి.విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్

వెంకయ్యనాయుడును కలిసిన దేవేందర్‌గౌడ్

మహేశ్వరం, మార్చి 5: భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును నగరంలో మంగళవారం మాజీ ఎంపీ టి.దేవేందర్‌గౌడ్, ఆయన తనయులు టి.విజయేందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్ కలిసి శాలువాతో సత్కరించారు. ఎం.వెంకయ్యనాయుడుకు పద్మభూషణ్ అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు విజయేందర్‌గౌడ్ తెలిపారు.

మహేశ్వరాన్ని కాంగ్రెస్ కంచుకోటగా తయారుచేద్దాం


పోరండ్లలో కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, మార్చి 5: మహేశ్వరం నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా తయారు చేద్దామని, ఇక్కడి బీఆర్ఎస్‌ను ఖాళీ చేద్దామని, ఇందుకు కార్యకర్తల కష్టసుఖాల్లో తమ వంతు సహకారం ఉంటుందని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం పోరండ్లలో కాంగ్రెస్ నాయకులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేర్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ మరవదన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి జిల్లాకు, మహేశ్వరం నియోజకవర్గానికి నిధులు తీసుకొద్దామన్నారు. గ్రామంలో ఏమైనా అసంపూర్తి పనులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ వారు కావచ్చు గానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు మరవొద్దన్నారు. త్వరలోనే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి పథకాలను అర్హులకు చేరవేసే బాధ్యతలను వాటికి అప్పగిస్తామన్నారు. దీనికి పార్టీ పెద్దలు ప్రణాళిక తయారు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాఘవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, ఓంకార్, పాండు, శేఖర్, యాదయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ టౌన్ మార్చి 5: ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1 నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గడువులోపు ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాల పనితీరును, రికార్డులను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ తహసీల్దార్ శైజల పాల్గొన్నారు.

చిమ్మచీకట్లో మండల కేంద్రం

- వీధిదీపాలు వెలగక ప్రజల అవస్థలు



హనుమాన్ ఆలయం వద్ద వెలగని వీధి దీపాలు

బొంరాస్‌పేట్, మార్చి 5: ప్రత్యేకాధికారుల పాలనలో అవస్థలు తీవ్రతరమయ్యాయి. వారం రోజులుగా బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో వీధి దీపాలు వెలగకపోవడంతో చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి. రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. సర్పంచ్‌ల పాలన ఉన్నంత వరకు బాధ్యతగా తీసుకున్న సర్పంచ్‌లు వీధిదీపాలు, తాగునీటి సరఫరా కోసం కృషిచేశారు. అయితే ప్రత్యేకాధికారుల పా లనలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మండల కేంద్రంలోనే విద్యుత్ వ్యవస్థ ఈ విధంగా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఏంటోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. వారం రోజులుగా వీధి దీపాలు వెలగకపోయినా ప్రత్యేకాధికారులు, పంచాయతీ సిబ్బంది, విద్యుత్ అధికారులు స్పందించడం లేదు. ఈ విషయంపై గ్రామస్తులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పేరుకే సీఎం నియోజకవర్గంగా ఉన్నా అధికారులు మాత్రం బాధ్యతగా వ్యవహరించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీధిదీపాలు వెలగకపోవడంతో అర్ధరాత్రి దొంగతనాలకు అవకాశం ఏర్పడుతుంది. ఆదివారం రాత్రి మీది హనుమాన్ దేవాలయం దగ్గర ఓ కిరాణ దుకాణ తాళాలు విరగొట్టి సరుకులు, నగదు అపహరించుకు వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు, విద్యుత్ అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

సమయానికి వైద్యం అందక వ్యక్తి మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

మేడ్చల్ టౌన్, మార్చి 5: సకాలంలో వైద్య సేవలు అందించక తమ బంధువు మృతి చెందాడంటూ మెడిసిటీ ఆసుపత్రి ఎదుట పలువురు మృతుడి కుటుంబసభ్యులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం శామీర్‌పేటకు చెందిన సాంబయ్య చేయి నొప్పి ఉందంటూ మంగళవారం ఉదయం మండలంలోని గణాపూర్ మెడిసిటీ ఆస్పత్రికి వెళ్లాడు. కాగా వైద్యులు సాంబయ్యను ఆస్పత్రిలో చేర్చుకుని వైద్య పరీక్షలు చేస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడి కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యసిబ్బందిని నిలదీశారు. నడుచుకుంటూ వచ్చి ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి సకాలంలో వైద్య సేవలు అందించక పోవటంతో అతను మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలంటూ ఆసుపత్రి ముందు బైఠాయించి ఆందోళ చేపట్టారు. పరిస్థితి చేయిదాటడంతో ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి మృతుడి కుటుంబసభ్యులను సముదాయించి నిరసన విరమింపజేశారు. కాగా రోగి తమ వద్దకు వచ్చిన వెంటనే వైద్యసేవలు అందించామని, వైద్యం చేస్తుండగా సాంబయ్య మృతిచెందాడని మెడిసిటీ ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

తాండూరురూరల్, మార్చి 5: గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తాండూరు మండలంలోని అంతారం వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. అంతారం గ్రామానికి చెందిన కె.నర్సింహులు(60) పాలిషింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నాడు. రోజూమాదిరిగా మంగళవారం ఉదయం పనినిమిత్తం ఉదయం 5గంటలకు ఇంటి నుంచి బయల్దేరిన నర్సింహులు రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

బషీరాబాద్, మార్చి 5: ఇంట్లో ఉరేసుకుని ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని కాశీంపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. కాశీంపూర్ గ్రామానికి చెందిన చింతకింది బసప్ప కూతురు గిరీశ(15) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే తమ కూతురు ఆత్మహత్యకు గల కారణం తెలియకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి పదేళ్ల కిందట మృతిచెందింది. తండ్రి, చెల్లెలుకు చేదోడువాదోడుగా ఉంటున్న గిరీశ ఆత్మహత్య ఎందుకు చేసుకుందో ఎవరికీ అర్థంకావడం లేదు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మూడు కార్లు, ఆటో ఢీ.. తప్పిన ముప్పు

పూడూరు, మార్చి 5: మూడు కార్లు, ఒక ఆటో ఢీకొన్న ఘటన మండలంలోని మోడల్ స్కూల్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. మన్నెగూడ నుంచి వికారాబాద్ వైపు మూడు కార్లు, ఒక ఆటో వెళ్తున్నాయి. ముందు లారీ ఉండటంతో స్పీడ్ బ్రేక్ వద్ద ఓ కారు సడన్ బ్రేక్ వేయడంతో వరుసగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో కార్లు దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఏ హానీ కలగలేదు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

- నలుగురికి జరిమానా

తాండూరు, మార్చి 5: తాండూరులో సోమవారం రాత్రి మద్యం సేవించి ఆటో డ్రైవర్ మహమ్మద్ ఇంతియాజ్‌పై తాండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అతన్ని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఇంతియాజ్‌కు రూ.10వేలు జరిమానాతో పాటు రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. మరో నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపగా ఒక్కొక్కరికి రూ.1500 జరిమానాను విధించినట్లు చెప్పారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలుశిక్ష తప్పదని సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు.

బషీరాబాద్‌లో ఒకరు..

బషీరాబాద్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి తాండూరు కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.ఆశోక్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పినట్లు బషీరాబాద్ ఎస్ఐ రమేష్ తెలిపారు. మండలంలోని ఇందర్‌చెడ్ గ్రామానికి చెందిన జెట్టూరు యాదప్ప ఇటీవల బషీరాబాద్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనంపై వస్తూ పట్టుబడ్డాడు. మద్యం సేవించినట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసులో సదరు వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా మద్యం తాగి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడితే కఠిన శిక్షలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

తాండూరు, మార్చి 5: బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీంపై తాండూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తాండూరు పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ హోటల్ వద్ద షెడ్డునిర్మాణ విషయంలో నయీం, హోటల్ యజమాని రాహుల్ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పరస్పరం దాడులకు యత్నించారు. ఈ ఘటన అనంతరం ఇరువురూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాహుల్ ఫిర్యాదు మేరకు నయీంపై అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో అక్రమాలు

- సహకారసంఘం వైస్‌చైర్మన్‌పై కేసు



మాట్లాడుతున్న బద్దం నరేందర్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్, మార్చి 5: ఫోర్జరీ డ్యాకుమెంట్లతో అక్రమాలకు పాల్పడుతున్న సహకారసంఘం వైస్‌చైర్మన్‌పై కోర్టు ఆదేశాల మేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బద్దం నరేందర్‌రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ సహకారసంఘం వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు బద్దం అనంతరెడ్డి భూఅక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం వారు పోచారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోచారం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 36లో గల 36.18ఎకరాల భూమిని 1986లో లేఅవుట్ చేసినట్లు వివరించారు. ఇందులో 1.39ఎకరాల స్థలానికి సంబంధించిన ప్లాట్లను జీపీఏ హక్కులు పొందిన బద్దం అడివిరెడ్డి, బద్దం బుచ్చిరెడ్డి, బద్దం మంగారెడ్డి విక్రయించలేదని అన్నారు. అయినప్పటికీ బద్దం అనంతరెడ్డి ఫోర్జరీ డ్యాకుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. దాదాపు రూ.20కోట్ల వరకు భూఅక్రమాలకు పాల్పడినట్లు వివరించారు. ఈవిషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. విచారణ చేసిన న్యాయమూర్తి అక్రమాలకు పాల్పడిన బద్దం అనంతరెడ్డి, బద్దం నర్సింహారెడ్డి, బద్దం కళావతి, మందాడి వినోదలపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆదేశించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు ఉచిత కట్టుమిషన్‌లు అందజేస్తున్న జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య

పరిగి, మార్చి 5: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉమ్మడి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య అన్నారు. జన్ సహస్, అంకిత సంస్థల సహకారంతో లెబర్‌కార్డులు కలిగినవారికి న్యాక్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో 90రోజులపాటు నిర్వహించిన కుట్టుశిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కుట్టుశిక్షణ పొందిన 25మందికి న్యాక్ వారిచే ఉచిత కుట్టుమిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డులు కలిగిన కార్మికులు శిక్షణ పొందడం ద్వారా నైపుణ్యతను పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో కార్మికులకు రూ.300ల నగదుతోపాటు, భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత న్యాక్ నుంచి ధృవీకరణ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న ప్రతి కార్మికుడు లేబర్ కార్డును పొందాలని, తద్వారా బీమాతో పాటు, ఇతర సంక్షేమపథకాలు లబ్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్‌సహస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్, ట్రెయినీ ఇన్‌చార్జి ప్రసాద్, ప్రజాప్రతినిధులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక వికాసానికి ఉచిత కోర్సులు, ప్లేస్‌మెంట్‌లు దోహదం



తక్షశీల డిగ్రీ కళాశాల యాజమాన్యం

వికారాబాద్, మార్చి 5: ఉచిత కోర్సులు, ప్లేస్‌మెంట్‌లు విద్యార్థుల సాంకేతిక వికాసానికి దోహదపడతాయని కళాశాల వైస్ చైర్మన్ మాణిక్యం ప్రభు అన్నారు. తక్షశీల డిగ్రీ కళాశాల టెక్స్ అకాడమి ద్వారా, డిగ్రీ బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ (డేటా సైన్స్) బీఎస్సీ (ఎంజెడ్సీ), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్), బీబీఏ, బీఏ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించడానికి అర్హులు గల విద్యార్థులను ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షను నిర్వహించారు. డిగ్రీ చదువుతున్న మహ్మద్ సోహైల్, బి.భరత్‌చంద్ర, ఎం.వైష్ణవి, బి.వైష్ణవి ఎంపికైనట్లు తెలిపారు. కోర్సులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని మోహన్‌దాస్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ తెలిపారు. టెక్స్ అకాడమి గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగులుగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ దావళగిరి తిరుపతిరెడ్డి, ట్రెజరర్ రాఘవేంద్ర జాదవ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరన్‌కోట్ గ్రామాభివృద్ధికి కృషి



కరన్‌కోట్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తాండూరురూరల్, మార్చి 5: జిల్లాలోనే మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగుతున్న కరన్‌కోట్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్‌తోపాటు మాజీ ఎంపీపీలు గాజుల శరణు బసప్ప అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.30లక్షలతో మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా సీసీరోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణుబసప్ప, శంషొద్దీన్, తుపాకుల బసప్ప, సుధాకర్ పాల్గొన్నారు.

సంపూర్ణ పోలియో నిర్మూలనే లక్ష్యం

పరిగి,మార్చి 5: వందశాతం పోలియో నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామని డబ్ల్యూహెచ్‌వో మానిటర్ కౌశిక్ అన్నారు. మంగళవారం చిట్యాల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం పరిగి మండలం రంగంపల్లి, సోండేపూర్, జిడిగడ్డతంగా, ఇటుకబట్టీల ప్రాంతాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పరిగి, మార్చి 5: మండలంలోని రూఫ్‌ఖాన్‌పేట్ పాఠశాలలో మంగళవారం కాంప్లెక్స్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రూఫ్‌ఖాన్‌పేట్, గడిసింగాపూర్, సాలిప్పలిబాటతండా, నస్కల్, పరిగి బాలికల పాఠశాల, సుల్తాన్‌పూర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్‌పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రతిభచాటిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామాంజనేయులు, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు నాగరాజు, శమంత, రమేశ్, మల్లేశం, సీఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



గోడుగోనిపల్లిలో శివస్వాముల పల్లకీసేవ

మర్పల్లి, మార్చి 5: పార్వతీ పరమేశ్వరుల ఆలయ 11వ వార్షికోత్సవంలో కల్యాణ మహోత్సవం మండలంలోని తుమ్మలపల్లిలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజలు రుద్రాభిషేకం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు, పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి పల్లకీసేవ

దోమ: గోడుగోనిపల్లిలో మంగళవారం శివస్వాములు ఆంజనేయస్వామికి చంద్ర అలంకరణతో పల్లకీసేవ నిర్వహించారు. శివమాల ధరించిన శివస్వాములు ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మల్లికార్జున ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

వికారాబాద్: మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబాసహిత మల్లికార్జున 67వ యాత్ర మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు డాక్టర్ ముద్ద భక్తవత్సలం ఒక ప్రకటనలో తెలిపారు. 6న గణపతి సృష్టి పుణాహవాదనం, కలశ స్థాపన, భూతశుద్ధి రంగపల్లి అగ్ని గుండముల అలంకరణ, 7న అగ్ని గుండ ప్రజల్వనం, స్వామి వారి పల్లకీ సేవ, అగ్ని గుండ మహోత్సవం, డోలారోహణం, కల్యాణం, ఓడి బియ్యం, రథోత్సవం ఉంటుందన్నారు. 8న త్రయోదశిచతుర్థి మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తుల్జభవాని సేవలో పరిగి ఎమ్మెల్యే దంపతులు



తుల్జభవాని ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పరిగి: మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో కొలువైన తుల్జాభవాని అమ్మవారి మంగళవారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అయోధ్య రామమందిరం ప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ బీజేపీ నాయకులు

కులకచర్ల: చౌడాపూర్ మండలంలోని రాంసింగ్ తండాలో మంగళవారం అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన ప్రసాదాన్ని తండాలో ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్యలో బాల రామ మందిరంను సందర్శిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్‌నాయక్, యువజన సంఘం నాయకులు హన్మంతు పాల్గొన్నారు.

నారాయణపూర్ రోడ్డు సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో రోడ్డు విషయమై మాట్లాడుతున్న నారాయణపూర్ గ్రామస్తులు

తాండూరురూరల్, మార్చి 5: తాండూరు పట్టణం రైల్వే గేటు నుంచి నారాయణపూర్ గ్రామం వరకు రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నారాయణపూర్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి, ఉప్పరి రాజు, శివకుమార్, ఉప్పరి నర్సింహులుతోపాటు మరికొందరు మంగళవారం తాండూరు పట్టణం క్యాంపు కార్యాలయంలో కలిసి వివరించారు. తాండూరు రైల్వే గేటు నుంచి పీర్‌పకీర్ సాబ్ దర్గా వరకు రోడ్డు సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమకు రైల్వే గేటు నుంచి చెనిగేష్‌పూర్ వరకు రైతుపొలాల్లో నుంచి రోడ్డువేసి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. అలా కుదరకుంటే పీర్‌పకీర్‌సాబ్ దర్గా నుంచి రైల్వే గేటు వరకు రైల్వే ట్రాక్ పక్క నుంచి బీటీ రోడ్డు వేయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



కృష్ణారెడ్డితో ఎంపీపీ, రుద్రారం గ్రామ నాయకులు

కొడంగల్ రూరల్, మార్చి 5: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి గత ఎన్నికల హామీల్లో భాగంగా కొడంగల్ మండలంలోని రుద్రారంలోని శ్రీరామ కాలనీలో సీసీ రోడ్డు పనులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆదర్శ కాలనీగా ఏర్పాటు చేసేందుకు నిధుల మంజూర్‌తో త్వరితగతిన పనులను పూర్తి చేయనున్నట్లు ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, సాయిలు, గోపాల్‌రెడ్డి, అంబయ్యగౌడ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడతాం



యాజమాన్యంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

మేడ్చల్ టౌన్, మార్చి 5: మయోరా ఇండియా పరిశ్రమ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడతామని మయోరా ఇండి పిరశ్రమ కార్మిక సంఘం అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి నియోజక వర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖరొరెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మయోర ఇండియా పరిశ్రమ కార్మిక సంఘం కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిశ్రమలో పనిచేసే ప్రతీ కార్మికుడి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్మికులపై పని వత్తిడి లేకుండా, వేతనాల పెంపు, ఇతర వసతులపై యాజమాన్యంతో చర్చించామన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి, ప్రధానకార్యదర్శిగా సంతోష్ కుమార్, ఉపాధ్యాక్షుడిగా బాలమల్లేష్, ఆర్గనైజర్ సెక్రటరీగా బీ.శ్రీను, కోశాధికారిగా సీహెచ్.ప్రసాద్‌రావులతో పాటు పలువురు కార్యకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వడ్లనందు

వికారాబాద్, మార్చి 5: మైలార్ దేవరంపల్లి గ్రామానికి చెందిన అనంతయ్య కుమారుడు మృతి చెందడంతో విషయం తెలుసుకున్న వడ్లనందు ఫౌండేషన్ చైర్మన్ నందు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో కుర్చీల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుర్చీలు

పూడూరు, మార్చి 5: పూడూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు కుర్చీలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'విరిగిన కుర్చీలు.. ఫిర్యాదుదారుల ఇక్కట్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ రమాదేవి స్పందించారు. కార్యాలయంలో విరిగిన కుర్చీల స్థానంలో కొత్తకుర్చీలు ఏర్పాటు చేశారు. కుర్చీలు లేక కార్యాలయానికి వచ్చిన వారు నేలపైనే కుర్చునే వారు. ఇప్పుడు కుర్చీల ఏర్పాటుతో ఇబ్బంది తొలగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ కార్మికులకు పురస్కారాలు



పురస్కారాన్ని అందుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

మేడ్చల్ టౌన్, మార్చి 5: ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ మేడ్చల్ డిపో కార్మికులకు మంగళవారం ప్రగతిచక్రాల పురస్కారంతో సన్మానించారు. ఇందనం ఆదా చేసిన డ్రైవర్, అత్యధిక ఇన్సెంటీవ్ పొందిన కండెక్టర్లకు రివార్డులు అందజేసి సన్మానించారు. డిపో మేనేజర్ సుధాకర్ కార్మికులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ధారూరు, మార్చి 5: మండలంలోని అల్లాపూర్‌లో జరుగుతున్న జాతీయ ఉపాధిహామీ పనులను ఎంపీడీవో నర్సింలు మంగళవారం పరిశీలించారు. బాలమ్మకుంట చెరువులో ఉపాధికూలీలు చేస్తున్న మరమ్మత్తు, పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈజీఎస్ ఏపీవో సురేశ్ ఆయనకు వివరాలు తెలిపారు.

మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా నర్సింహులు

దోమ, మార్చి 5: అయినాపూర్‌లో మంగళవారం మత్స్య సహకార సంఘం ఎన్నిక నిర్వహించారు. సంఘం చైర్మన్‌గా బోయిని నర్సింహులు, కార్యదర్శి బుసని రాములుతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి ఎన్నికల అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు.

సంక్షిప్తంగా..

- **కులకచర్ల:** ధరణి సమస్యలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టారు. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ నెల 9 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కులకచర్ల తహసీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. ధరణిలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చూస్తామని వారు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధరణిపై సమీక్ష నిర్వహించారు. లోటుపాట్లు ఉంటే సవరణలు చేస్తామని, రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.
- **శామీర్‌పేట:** వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం ఏవో కృష్ణవేణి అన్నారు. మండలంలోని లాల్‌గడి మలక్‌పేటలో వరిపంటలపై సోకిన మొగిపురుగు, జింక్‌లోపంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. రైతుల పొలాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు వేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట వ్యవసాయాధికారి రమేష్, ఏఈఓ సరోజ, రైతులు హరిశంకర్, బద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.
- **కులకచర్ల:** ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్, బోటని, పొలిటికల్ సైన్స్ పరీక్షలుజరిగాయి. రామలింగేశ్వర కళాశాలలో 247 మంది విద్యార్థులకు 7 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ కామేశ్వరి తెలిపారు. వివేకానంద కళాశాలలో 173మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రాములు ఈ సందర్భంగా తెలిపారు.
- **శామీర్‌పేట:** మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. శామీర్‌పేటకు చెందిన పలువురు దాతలుగా ముందుకు వచ్చి అన్నదానం చేశారు.
- **కులకచర్ల:** రోడ్లపై చెత్తవేస్తే చర్యలు తప్పవని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామానికి గల నలురోడ్లపై ఉన్న చెత్తను మంగళవారం పారిశుధ్య కార్మికులతో తొలగింపజేశారు.
- **శామీర్‌పేట:** శామీర్‌పేట పెద్ద చెరువు శ్రీకట్టమైసమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నధానం నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి పత్ర్యేక పూజలు జరిపారు. ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నధానం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.
- **కులకచర్ల:** వాయిదా పడిన మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పాంబండ రామలింగేశ్వస్వామి దేవాలయం కొబ్బరి కాయల వేలంను ఈ నెల 12న దేవాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్ తెలిపారు. పాంబండ పెద్ద జాతర సందర్భంగా మార్చి 30 నుంచి ఏప్రిల్ 9 వరకు కొబ్బరికాయలు విక్రయించేందుకు వీలుంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.